# సాక్షి అనంతపురం

సోమవారం : 6 : మే : 2024




**శ్రమ జీవుల కేంద్రం.. దుర్గం**

జిల్లాలోని రాయదుర్గం విశిష్టతకు మారుపేరు. ఇక్కడి ప్రజలు వ్యవసాయం, పరిశ్రమలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. 8లో



**టీడీపీ కవ్వింపు చర్యలు**

గుత్తిలో ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహిస్తుండగా, టీడీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డాయి. 8లో

**గరిష్టం/కనిష్టం 44.1°/25.8°**

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు భారీగా నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత అధికంగా ఉంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వడగాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### జేఎన్‌టీయూ పురోగతికి సహకరిస్తా

- కేంద్ర రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారు సతీష్ రెడ్డి



వర్సిటీ ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న డాక్టర్ జి. సతీష్ రెడ్డి

**అనంతపురం:** జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల పురోగతికి సంపూర్ణ సహకారం అందిస్తానని వర్సిటీ పూర్వ విద్యార్థి, కేంద్ర రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారు డాక్టర్ జి. సతీష్ రెడ్డి అన్నారు. ఆదివారం జేఎన్‌టీయూకు ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డికి వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రీసెర్చ్ ప్రాజెక్టులకు, కాన్ఫరెన్సులు నిర్వహించడానికి తోడ్పాటు అందిస్తానన్నారు. ఇమేజ్ ప్రాసెసింగ్, సైబర్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అంశాలపై గెస్ట్ లెక్చర్స్ ఏర్పాటు చేస్తానన్నారు. వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు మాట్లాడుతూ.. వర్సిటీ పురోగతికి పూర్వ విద్యార్థుల తోడ్పాటు ఎల్లప్పుడూ ఉండాలన్నారు. ఈ విషయంలో డాక్టర్ జి. సతీష్ రెడ్డి సహకారం మరువలేనిదన్నారు. రీసెర్చ్ ప్రాజెక్టులు రావడానికి ఆయన సలహాలు తీసుకుంటామన్నారు. ప్రస్తుత విద్యార్థులకు ఎక్స్‌పర్ట్ లెక్చర్స్ ఏర్పాటు చేయడానికి సహకారం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, పూర్వ విద్యార్థులు రవి మారుతీ రెడ్డి, సి. రంగనాయకులు (1984 బ్యాచ్) పూర్వ విద్యార్థుల డైరెక్టర్ ప్రొఫెసర్ పి. సుజాత, ప్రొఫెసర్ బి. దుర్గాప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి, పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సంయమనంతో పనిచేయండి




మాట్లాడుతున్న ప్రత్యేక పోలీసు పరిశీలకులు దీపక్ మిశ్రా, చిత్రంలో కలెక్టర్ వినోద్ కుమార్, డీఐజీ అమ్మిరెడ్డి

**అనంతపురం అర్బన్:** 'ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించే విషయంలో పోలీసు వ్యవస్థది కీలక పాత్ర. అన్ని స్థాయిల అధికారులు అప్రమత్తంగా ఉంటూ, ప్రతి దశలోనూ సంయమనం పాటిస్తూ విధులు నిర్వర్తించాలి' అని ప్రత్యేక పోలీసు పరిశీలకుడు దీపక్ మిశ్ర అన్నారు. ఆదివారం జిల్లాకు చేరుకున్న ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల సంసిద్ధతపై కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్, పరిశీలకులు మనీష్‌సింగ్, అజయ్‌నాథ్ ఝ, రవికుమార్, నితిన్ అగర్వాల్, రాందాస్ టి.కాలే, డీఐజీ ఆర్‌ఎస్ అమ్మిరెడ్డి, ఎస్పీ అమిత్ బర్దర్‌తో కలిసి ఏఎస్పీలు, డీఎస్పీలతో సమావేశం నిర్వహించారు. దీపక్ మిశ్రా మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అసాంఘిక శక్తులు, గొడవలు సృష్టించే వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. సమావేశంలో జేసీ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగరపాలక కమిషనర్ మేఘ స్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, ఏఎస్పీలు విజయ భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, తదితరులున్నారు.

### ఒక్క ఉద్యోగి ఓటు హక్కూ తిరస్కరించొద్దు

**అనంతపురం అర్బన్:** ఎన్నికల విధులు నిర్వర్తించే ఏ ఒక్క ఉద్యోగి ఓటు హక్కును కూడా తిరస్కరించరాదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. అప్పటికప్పుడు ఫారం–12ను స్వీకరించి అర్హులైన ఉద్యోగులందరికీ ఓటు హక్కు కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదివారం ఆదేశాలు జారీ చేశారన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగి అనివార్య కారణాలతో ఈనెల 1 లోగా ఫారం–12 సమర్పించలేకపోతే, ఏ ఆర్‌ఓ పరిధిలో ఆ ఉద్యోగి ఓటరుగా నమోదు అయ్యారో, ఆ ఆర్‌ఓకు ఫారం–12 సమర్పించేందుకు, ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అనుమతించాలన్నారు. ఈ నెల 7, 8 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫెసిలిటేషన్ కేంద్రాలు పని చేస్తాయన్నారు. ఉద్యోగులకు మంజూరు చేసిన ప్రత్యేక సెలవును సద్వినియోగం చేసుకుని పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

# అరాచక శక్తులు.. కేసుల గుట్టలు



## భూముల కబ్జాకోరులు, కరుడుగట్టిన నేరస్తులకు చంద్రబాబు టికెట్లు

ఒకరు భూ కబ్జాకోరు, హత్యా రాజకీయాలకు మారు పేరు.. మరొకరు అవినీతి అక్రమాలకు దేశస్థాయిలో పేరుగాంచిన వారు.. బ్యాంకులకే ఎగనామం పెట్టిన వారు ఇంకొకరైతే, బ్లాక్‌మెయిలింగ్‌కు పేరుగాంచిన మహానుభావుడు మరొకరు.. కుట్రలు, కుతంత్రాలకు మారుపేరైన చంద్రబాబు.. తనకు తగ్గ టీంనే ఈసారి బరిలోకి దించారు. దౌర్జన్యకారులు, ఖూనీకోరులను ఎంపిక చేసి మరీ టికెట్లు కట్టబెట్టారు.



- అనంతపురం టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్‌పై ఏకంగా హత్య కేసు
- 'కదిరి' కందికుంట ప్రసాద్‌పై లెక్కలేనన్ని కేసులు
- బ్లాక్‌మెయిలింగ్, దౌర్జన్యం కేసుల్లో ఎమ్మెస్ రాజు దిట్ట
- జేసీ కుటుంబ కేసుల చరిత్ర వింటే దిమ్మతిరగాల్సిందే

**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో టీడీపీ టికెట్లు దక్కించుకున్న వారిలో ఎవరి చరిత్ర చూసినా కళ్లు బైర్లు కమ్ముతాయి. వీరిని తలచుకుంటేనే సామాన్యులు బెంబేలెత్తాల్సిన పరిస్థితి. కానీ, వీరంతా టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టిలో సచ్ఛీలురు కావడమే దౌర్భాగ్యం. అడుగడుగునా అడ్డదారుల్లో ముందుకెళ్తూ, ఎదురొచ్చిన వారిని అడ్డు తొలగించుకుంటూ రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించిన చంద్రబాబు టీంలోని వీరు ఒకవేళ కర్మ కొద్దీ ప్రజాప్రతినిధులుగా ఎన్నికైతే జిల్లాలో పరిస్థితులు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు.

**దళితులకు శరగోపం.. హత్యా రాజకీయం..**

తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న అనంతపురం అర్బన్ టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌పై 2015లో ఏకంగా హత్య కేసు నమోదైంది. వైఎస్సార్ సీపీ నేత ప్రసాద్‌రెడ్డి దారుణ హత్య కేసులో నిందితుడిగా ఉన్నారు. ఇక.. బండమీద పల్లిలో ఓ దళితుడి భూమిని అక్రమంగా లాక్కున్నాడన్న కారణంగా బాధితుడు ఆత్మహత్యాయత్నం కూడా చేశారు. దీంతో అప్పట్లో దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు వ్యతిరేకంగా దళిత సంఘాల నాయకులు ధర్నాకు దిగడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

**డాక్టర్ వద్దంట.. కేసుల వీరుడే ముద్దంట**

మడకశిర నియోజకవర్గ సీటును 52 కేసులున్న ఎమ్మెస్ రాజుకు చంద్రబాబు కేటాయించారు. ఉన్నత చదువులు చదివిన డాక్టర్ సునీల్‌కు ముందు టికెట్ ఇచ్చిన బాబు... ఆ తర్వాత ఆయన నుంచి టికెట్ లాక్కుని మరీ నేర చరితుడికి కట్టబెట్టారు. బ్లాక్‌మెయిలింగ్ చేయడం, డబ్బు తీసుకుని తిరిగి ఇవ్వకపోవడం, ప్రశ్నిస్తే దౌర్జన్యం చేయడం ఇలా రకరకాల కేసులు ఎమ్మెస్ రాజుపై నమోదై ఉండడం గమనార్హం. శింగనమల, అనంతపురం ప్రాంతాల్లోని స్టేషన్లలో దాదాపు 52 కేసులు ఇతనిపై ఉన్నాయి.

**జేసీ చరిత్రంతా నేరాల మయమే..**

జేసీ.. ఈ పేరు చెబితే చాలు నేరాలకు కేరాఫ్ అడ్రస్ అన్నట్టుంటుంది. ఫ్యాక్షన్ హత్యలను ప్రోత్సహించి చలి కాచుకున్న జేసీ దివాకర్ రెడ్డి, జేసీ ప్రభాకర్ రెడ్డి.. అవినీతి చేయడంలోనూ పేట్రేగిపోయారు. నకిలీ ఇన్‌వాయిస్‌లతో వాహనాల అమ్మకం, అనుమతులు లేకుండా బస్సులు తిప్పడం కేసుల్లో జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు అస్మిత్‌రెడ్డి జైలుకు కూడా వెళ్లొచ్చారు. వీరి ఘనకార్యంపై దేశస్థాయిలో చర్చ నడిచింది. ఇప్పుడు అలాంటి నేరచరిత్ర కలిగిన అస్మిత్ రెడ్డికే చంద్రబాబు తాడిపత్రి టికెట్ ఇచ్చారు. ఎప్పుడూ తాడిపత్రిలో ఏదో ఒక వివాదం సృష్టిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం వీరికి వెన్నతో పెట్టిన విద్య అని అందరికీ తెలిసిందే.

**తిట్టి.. టికెట్ కట్టబెట్టి..**

గుమ్మనూరు జయరాం మంత్రిగా ఉన్న సమయంలో చంద్రబాబు, ఆయన పుత్రరత్నం నారా లోకేష్‌లు జయరాంను తిట్టని తిట్టంటూ లేదు. మట్కా ఆడిస్తారని, పేకాట క్లబ్బులు నడిపిస్తారని, బెంజ్‌కార్లు లంచంగా తీసుకున్నారని ఇలా లెక్కలేనని ఆరోపణలు చేశారు. అయితే, ఎప్పుడైతే ఆయన టీడీపీ తీర్థం పుచ్చుకున్నారో వెంటనే సచ్ఛీలుడై పోయాడు. ఇష్టమొచ్చినట్లు తిట్టిన బాబే ఆయనకు గుంతకల్లు టికెట్ ఇవ్వడంతో స్థానికులే కాదు.. జిల్లా ప్రజానీకమంతా ముక్కున వేలేసుకుంది.

**పరిటాలలకే ఎందుకో..?**

టీడీపీ తరఫున రాప్తాడు ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న పరిటాల సునీత కుటుంబం పేరెత్తితేనే గతంలో ఆ కుటుంబం సాగించిన రక్తచరిత్ర గుర్తుకొస్తుంది. సునీత భర్త పరిటాల రవి అప్పట్లో చేసిన హత్యారాజకీయాల గురించి ఇప్పటికీ జిల్లావ్యాప్తంగా కథలుకథలుగా చెప్పుకుంటారు. ఆర్‌వోసీ పేరుతో కొన్ని వందల మందిని ఊచకోత కోసినట్లు చెబుతారు. దీనికితోడు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రిగా పనిచేసిన సునీత అవినీతి, అక్రమాలకు లెక్కేలేదు.

**కబ్జాల కందికుంట**

కదిరి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న కందికుంట వెంకటప్రసాద్‌పై లెక్కలేనన్ని కేసులున్నాయి. కదిరిలో కంటికి కనిపించిన భూములన్నీ కబ్జా చేసేస్తాడనే ఆరోపణలున్నాయి. ఒక రేప్ కేసులో ఈయన నిందితుడిగా ఉన్నట్లు గతంలో ఓ సర్వే సంస్థ వెల్లడించింది. హత్య, హత్యాయత్నం కేసులు ఉన్నాయి. చెక్‌బౌన్స్ కేసులైతే లెక్కలేనన్ని. నకిలీ డీడీల కేసులోనూ నిందితుడిగా ఉన్నారు. ఆ కేసును ఇటీవల కొట్టేయడంతో ఇదే అదనుగా చంద్రబాబు ఆయనకు సీటిచ్చేశారు.

- పెనుకొండ టీడీపీ అభ్యర్థి సవిత కూడా తక్కువేమీ కాదు. గ్రానైట్, మట్టి, పెట్రోలు కుంభకోణాలకు పాల్పడ్డారని ఈమెపై అనేక కేసులున్నాయి.

### ఒక హత్య.. మరో హత్యాయత్నం!

ఎన్నికల నేపథ్యంలో హత్యా రాజకీయాలకు టీడీపీ నాయకులు తెరలేపారు. కొన్ని రోజుల క్రితం అనంతపురం అర్బన్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు గుజ్జల నగేష్‌పై పచ్చ పార్టీకి చెందిన జయరాం నాయుడు వర్గీయులు మారణాయుధాలతో విరుచుకుపడ్డారు. మరోవైపు కదిరి నియోజకవర్గం జౌకుల గ్రామంలో నాగభూషణం అనే యువకుడిని టీడీపీ వర్గీయులు చంపేశారు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నేర చరితులకు చంద్రబాబు టికెట్లు కట్టబెట్టడంతోనే ఇలా జరుగుతోందంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. చంద్రబాబు వైఖరి చూస్తుంటే జిల్లాలో మళ్లీ ఫ్యాక్షన్ రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నారని స్పష్టంగా అర్థమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



టీడీపీ మూకల దాడిలో గాయపడ్డ గుజ్జల నగేష్ (ఫైల్)

# అధికారంలోకి వస్తే పాతేస్తాం

- పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు టీడీపీ ప్రలోభాలు
- చిత్రీకరించబోయిన 'సాక్షి'పై చిందులు తొక్కిన టీడీపీ నాయకుడు
- అసభ్య పదజాలంతో దూషణ పర్వం

**రాయదుర్గం:** 'రేయ్ మా పార్టీ అధికారంలోకి వస్తే పాతేస్తాం' అంటూ ఓ టీడీపీ నాయకుడు 'సాక్షి' విలేకరిపై రెచ్చిపోయాడు. వివరాలు.. పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రం సమీపాన టీడీపీకి చెందిన పలువురు రౌడీషీటర్లు ఉద్యోగులకు ఆదివారం డబ్బు పంచుతున్నారు. విషయాన్ని స్థానికులు 'సాక్షి'కి సమాచారం ఇవ్వగా విలేకరి వెళ్లాడు. పచ్చ మూకలు డబ్బు పంచుతున్న దృశ్యాలను ఫొటోలు తీస్తుండగా, గమనించిన టీడీపీ నాయకుడు చిందులు తొక్కాడు. రేయ్.. ఫొటోలు ఎందుకు తీస్తున్నావ్ రా..? అంటూ అసభ్య పదజాలంతో దూషించాడు. అధికారంలోకి రాగానే నీ అంతు చూస్తానంటూ విలేకరిపై దూసుకొచ్చాడు. ఇక్కడే ఉండు మా వాళ్లను రప్పిస్తానంటూ పలువురు పచ్చ రౌడీలకు ఫోన్లు చేశారు. అయితే, ఈ క్రమంలోనే అక్కడికి పోలీసులు రావడంతో తోక ముడిచాడు.



రాయదుర్గం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం ముందే గుమిగూడిన పచ్చ మూక

**తమ నాయకుడి బాటలోనే..**

తమ ఆగడాలకు అడ్డొచ్చిన వారిని దూషించడం, చంపేస్తామంటూ బెదిరించడం టీడీపీ రాయదుర్గం అభ్యర్థి కాలవ శ్రీనివాసులు నుంచి ఆ పార్టీ నాయకులు పుణికిపుచ్చుకున్నట్లున్నారు. కాలవ కూడా అంతే.. గత ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ సందర్భంగా 'సాక్షి' విలేకరిపై బెదిరింపులకు దిగారు. ఇష్టారాజ్యంగా దూషించాడు. అప్పట్లో ఆయన అరాచకాలను ప్రశ్నిస్తే కూడా చిందులు తొక్కేవాడు. ఆ విషయాలన్నింటినీ గమనించిన ప్రజలు గుణపాఠం చెప్పి ఇంట్లో కూర్చోబెట్టారు. అయినప్పటికీ బుద్ధి మార్చుకోకుండా తన అనుచరులను నేడు ఉసిగొల్పుతుండడంతో ప్రజలు అసహ్యించుకుంటున్నారు.

# రెచ్చిపోతున్న 'పచ్చ' మంద

**బెళుగుప్ప:** 'పచ్చ' మూకలు రెచ్చిపోతున్నాయి. పోలింగ్ దగ్గర పడే కొద్దీ ప్రజలను భయభ్రాంతులను గురి చేయడమే లక్ష్యంగా చెలరేగుతున్నాయి. తాజాగా వైఎస్సార్ సీపీకి చెందిన ప్రచార రథంపై దాడికి దిగిన ఘటన ఆదివారం బెళుగుప్ప కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో చోటుచేసుకుంది. టీడీపీ గూండాల దాడిలో ప్రచార రథం దెబ్బతింది. దీనిపై వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మచ్చన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుల కుమారులు అంజి, భరత్‌లు ఏపీ39 ఎఫ్‌డబ్ల్యూ 6303 నంబర్ ద్విచక్ర వాహనంలో వచ్చి దాడులకు తెగబడినట్లు పేర్కొన్నారు. రెండు రోజుల ముందు కూడా అంబేడ్కర్ కాలనీలో ప్రచారానికి వెళ్లిన సమయంలో టీడీపీ నాయకులు శ్రీరాములు, నారాయణ, సూర్యనారాయణ, తిప్పేస్వామి అడ్డుకోవడానికి యత్నించారని, ఈ విషయాలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**వైఎస్సార్‌సీపీ నేత ఇంటిపై రాళ్లు**

**కంబదూరు:** కళ్యాణదుర్గం టీడీపీ అభ్యర్థి అండతో ఆ పార్టీ కార్యకర్తలు దాడులకు తెగబడుతున్నారు. ఆదివారం మండలంలోని పాళ్లూరు గ్రామంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆ సమయంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేత బోయ కిష్టప్ప ఇంటి దగ్గరకు వచ్చినప్పుడు రెచ్చగొట్టాలన్న ఉద్దేశంతో టపాసులు పేల్చారు. కిష్టప్ప భార్య గంగరత్నమ్మ బయటకు వచ్చి గడ్డివాములు, మూగజీవాలు, చిన్న పిల్లలు ఉన్నారు, ఇళ్ల ముందర టపాసులు కాలిస్తే ఎలా? నిప్పు రవ్వలు పడి ప్రమాదం జరుగుతుంది అని చెబుతుండగానే వాహనాల్లో ఉన్న కొంత మంది టీడీపీ కార్యకర్తలు ఒక్కసారిగా దిగి ఇంటిపై రాళ్లు విసిరారు. భయకంపితురాలైన గంగరత్నమ్మ వెంటనే ఇంట్లోకి వెళ్లిపోయింది. వైఎస్సార్ సీపీలో క్రియాశీలకంగా పని చేస్తుండడంతోనే కక్షకట్టి దాడులు చేస్తున్నారని కిష్టప్ప వాపోయారు.




బెళుగుప్పలో టీడీపీ వర్గీయుల దాడిలో ధ్వంసమైన వైఎస్సార్‌సీపీ ప్రచార రథం

### పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ @ 7,588

**అనంతపురం అర్బన్:** సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కొనసాగుతోంది. జిల్లావ్యాప్తంగా 26,150 పోస్టల్ బ్యాలెట్‌లు ఉండగా మూడో రోజు ఆదివారం నాటికి 7,588 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వివరాలిలా..**

| నియోజకవర్గం | పోస్టల్ బ్యాలెట్లు | 5వ తేదీ వరకు ఓటు వేసిన వారు |
|---|---|---|
| రాయదుర్గం | 1,877 | 480 |
| ఉరవకొండ | 2,124 | 647 |
| గుంతకల్లు | 3,032 | 988 |
| తాడిపత్రి | 2,388 | 927 |
| శింగనమల | 1,810 | 563 |
| అనంతపురం | 6,594 | 1,846 |
| కళ్యాణదుర్గం | 2,566 | 694 |
| రాప్తాడు | 3,528 | 1,191 |
| ఇతర జిల్లాలు | 2,231 | 252 |
| మొత్తం | 26,150 | 7,588 |



అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డిలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు (ఇన్‌సెట్) ప్రకాష్ రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం





శింగనమల మండలం తరిమెలలో ప్రచారంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు (ఇన్‌సెట్) ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వీరాంజనేయులు, శంకరనారాయణను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం






బ్రహ్మసముద్రం మండలం మామడూరులో ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య నిర్వహించిన రోడ్‌షోకు హాజరైన ప్రజలు, ప్రసంగిస్తున్న రంగయ్య



## సమరోత్సాహం

ఎన్నికల కదనరంగంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు దూసుకుపోతున్నారు. టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీలో చేరుతుండడంతో శ్రేణులు సమరోత్సాహంతో ప్రచారంలో పాల్గొంటున్నారు. ప్రజా బలమే తోడుగా సాగిపోతున్నారు. – సాక్షి నెట్‌వర్క్







అనంతపురంలో ఎమ్మెల్యే అనంతకు గుమ్మడికాయలతో దిష్టితీస్తున్న మహిళలు, విడపనకల్లు మండలం గాజుల మల్లాపురంలో 'విశ్వ'కు స్వాగతం పలుకుతున్న నాయకులు, పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

# శ్రమజీవుల కేంద్రం.. రాయదుర్గం

## క్లుప్తంగా

### ఆమిద్యాలలో దాయాదుల ఘర్షణ



తీవ్రంగా గాయపడిన రామకృష్ణ

**ఉరవకొండ:** మండలంలోని ఆమిద్యాలలో దాయాదుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన దబ్బర రామకృష్ణ, వెంకటనారాయణ దాయాదులు. వీరి మధ్య కొంత కాలంగా ఆస్తి వివాదం నెలకొని ఉంది. ఈ క్రమంలో ఆదివారం పొలంలో పనిచేసుకుంటున్న రామకృష్ణ, ఆయన కుమారులు లోకేష్, ధనుంజయపై వెంకటనారాయణ, ఆయన కుమారుడు అమర్ కర్రలతో విరుచుకుపడ్డారు. ఘటనలో దబ్బర రామకృష్ణ, లోకేష్, ధనంజయకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో రామకృష్ణను మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం




స్వాధీనం చేసుకున్న మద్యం ప్యాకెట్లు చూపుతున్న సెబ్ అధికారులు

**బొమ్మనహాళ్:** అక్రమంగా కర్ణాటక నుంచి మద్యం టెట్రా ప్యాకెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్న ముగ్గురిని సెబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ గ్రామంలో మద్యం విక్రయిస్తున్నట్లుగా అందిన పక్కా సమాచారం మేరకు సెబ్ సీఐ కిషోర్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఎరికల నాగరాజు వద్ద 192 టెట్రా ప్యాకెట్లు, గంగవరం బాబావలి వద్ద 864 టెట్రా ప్యాకెట్లతో పాటు సరిహద్దు వద్ద మద్యం సరఫరా చేస్తున్న కర్ణాటకకు చెందని మహమ్మద్ షబ్బీర్ హుసేన్ వద్ద 450 టెట్రా ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకుని, ఓ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

### అనంతపురం డీఎస్పీ బదిలీ

**అనంతపురం:** నగర డీఎస్పీ జి.వీర రాఘవ రెడ్డిని బదిలీ చేస్తూ డీజీపీ కె.రాజేంద్రనాథరెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే పోలీస్ హెడ్క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

- వ్యవసాయం, పరిశ్రమలతో ఉపాధి
- జీన్స్ ప్యాంట్ల తయారీకి పెట్టింది పేరు
- నియోజకవర్గంలో ఇప్పటికి 17 సార్లు ఎన్నికలు




**రాయదుర్గం:** క్రీ.శ 15వ శతాబ్దంలో విజయనగర భూపతి రాజుల 3వ రాజధానిగా ఏర్పడిన రాయలదుర్గం... కర్ణాటకకు కూతవేటు దూరంలో ఉంది. చుట్టూ దట్టమైన కొండలు, కోటలతో చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచిన రాయలదుర్గం అనంతరం వాడుక భాషలో రాయదుర్గంగా మారింది. బ్రిటీష్ పాలనలో తాలూకా హెడ్క్వార్టర్ ఉన్న రాయదుర్గం 1951 వరకు కర్ణాటకలోని బళ్లారి జిల్లాలో ఉండేది. 1952 తర్వాత అనంతపురం జిల్లాలోకి కలుపుతూ రాయదుర్గం, డి.హీరేహాళ్, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, కణేకల్లు మండలాలను కలిపి నియోజకవర్గ కేంద్రంగా ఏర్పడింది. ఈ నియోజకవర్గానికి తూర్పున 40 కిలోమీటర్ల దూరంలో కళ్యాణదుర్గం, పడమర 7 కిలోమీటర్ల దూరంలో కర్ణాటకలోని మొలకాల్మూరు, ఉత్తరాన 50 కిలోమీటర్ల దూరంలో బళ్లారి, దక్షిణాన 40 కిలోమీటర్ల దూరంలో కర్ణాటకలోని చెళ్లకెర ఉన్నాయి.

**10 సార్లు కాంగ్రెస్ అభ్యర్థులదే విజయం**

నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకూ ఉప ఎన్నికలతో కలుపుకుని 17 సార్లు ఎన్నికలు జరగగా 10 సార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే గెలుపొందారు. 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా స్వాతంత్య్ర సమరయోధుడు, న్యాయవాది గురుమాల్ నాగభూషణం గెలుపొందారు. 1957లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఎస్‌సీ శేషాద్రి, 1962లో లక్క చిన్నపరెడ్డి (కాంగ్రెస్), 1967లో తిప్పేస్వామి (స్వతంత్ర), 1972లో తిప్పేస్వామి (కాంగ్రెస్), 1975లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పి.వెంకటరమణ, 1978లో కేబీ చన్నప్ప (కాంగ్రెస్ ఐ), 1983లో పాటిల్ వేణుగోపాలరెడ్డి (స్వతంత్ర), 1988లో బండి హులికుంటప్ప (కాంగ్రెస్), 1989లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పాటిల్ వేణుగోపాలరెడ్డి, 1994లో టీడీపీ తరపున బండి హులికుంటప్ప, 1999లో పాటిల్ వేణుగోపాలరెడ్డి (కాంగ్రెస్), 2004లో మెట్టు గోవిందరెడ్డి (టీడీపీ), 2009లో కాంగ్రెస్ తరపున, 2012లో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేసిన కాపు రామచంద్రారెడ్డి, 2014లో కాలవ శ్రీనివాసులు (టీడీపీ), 2019లో కాపు రామచంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ) గెలుపొందారు.

**కర్ణాటక రాజకీయాల్లోనూ దుర్గం వాసులు**

కర్ణాటక రాజకీయాలను సైతం రాయదుర్గం వాసులు శాసించారు. నియోజకవర్గంలోని డి.హీరేహాళ్ మండలం ఎం.హనుమాపురం గ్రామానికి చెందిన సూర్యనారాయణరెడ్డి కురుగోడు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అదే కుటుంబానికి చెందిన బసవరాజేశ్వరి కర్ణాటక ఎంపీగా, మంత్రిగా పదవులు అనుభవించారు. డి.హీరేహాళ్‌కు చెందిన హెచ్‌జీ రాములు గంగావతి నుంచి ఎంపీగా గెలుపొందారు.

**ఆధ్యాత్మిక క్షేత్రాలకు పెట్టింది పేరు**

రాయదుర్గం నియోజకవర్గంలో లెక్కలేనన్ని ఆధ్యాత్మిక క్షేత్రాలు ఉన్నాయి. పట్టణంలోని దశభుజ గణపతి ఆలయం దక్షిణ భారత దేశంలోనే ప్రఖ్యాతి గాంచింది. పశుపతి నాథ ఆలయం, కోట వెంకటేశ్వరుడి ఆలయం ప్రసిద్ధి చెందాయి. మురడి, నేమకల్లులో వ్యాస మహర్షి ప్రతిష్టించిన ఆంజనేయస్వామి ఆలయాలు భక్తుల కొంగుబంగారమై విరాజిల్లుతున్నాయి. డి.హొన్నూరు గ్రామంలో వెలసిన దర్గా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే ప్రఖ్యాతి గాంచింది.



భూపతిరాజుల కాలంలో వెలసిన ఆలయం

**నియోజకవర్గ ఓటర్ల వివరాలు...**

| పురుషులు | మహిళలు |
|---|---|
| 2,64,352 | 1,33,516 |
| **ఇతరులు** | **మొత్తం ఓటర్లు** |
| 42 | 2,70,648 |



### వ్యవసాయం, పరిశ్రమలే ఆధారం

రాయదుర్గం నియోజకవర్గంలో మెట్ట సాగు భూములు అధికంగా ఉన్నాయి. 2.51 లక్షల హెక్టార్ల సాధరణ సాగు విస్తీర్ణం కాగా, ఇందులో 1.92 హెక్టార్లలో మెట్ట వ్యవసాయాన్ని రైతులు సాగిస్తున్నారు. కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాల్లో హెచ్చెల్సీ కింద 35 వేల ఎకరాలు, బీటీ ప్రాజెక్ట్ కింద 8,400ల ఎకరాల ఆయకట్టు ఉంది. బోరుబావుల ద్వారా మరో 10 వేల ఎకరాల్లో సాగులోకి వస్తోంది. దీంతో ఈ ప్రాంత ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయమే అయింది. వర్షాధారంగా వేరుశనగ పంట అధిక విస్తీర్ణంలో సాగులోకి వస్తుంది. హెచ్చెల్సీ ద్వారా అందే తుంగభద్ర జలాలు ఈ ప్రాంతానికి జీవనాడిగా మారాయి. బీటీ ప్రాజెక్ట్ దీనికితోడు డి.హీరేహాళ్, బొమ్మనహాళ్ మండలాల్లో ఐరన్ ఓర్ పరిశ్రమలు ఉన్నాయి. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలతో పాటు, ఐరన్ ఓర్, గార్మెంట్స్ పరిశ్రమల ద్వారా వేలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. రాయదుర్గం జీన్స్ ఉత్పత్తులు దక్షిణ భారతదేశంలోనే ప్రఖ్యాతి గాంచాయి.



### బరిలో 13 మంది



మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి

రాయదుర్గం నియోజకవర్గ ఎన్నికల బరిలో 13 మంది నిలిచారు. వీరిలో వైఎస్సార్‌సీపీ తరపున మెట్టు గోవిందరెడ్డి, టీడీపీ అభ్యర్థిగా కాలవ శ్రీనివాసులు, కాంగ్రెస్ అభ్యర్థిగా వడ్డె చిన్నప్పయ్య, బీఎస్పీ తరపున చిందనూరు నాగరాజు, భారత చైతన్య యువజన పార్టీ తరపున జి.ప్రతాపరెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా యు.రామచంద్రారెడ్డి, కావలి శ్రీనివాసులు, కురుబ శ్రీనివాసులు, కావలి శ్రీనివాసులు, ఎం.గోవిందు, పగడాల గోవిందరాజులు, బళ్లారి గోవిందు, హెచ్.రంగనాథ్ బరిలో నిలిచారు.

**రాయదుర్గం నియోజకవర్గంలో 2019 నుంచి 2024 వరకు పథకాల ద్వారా అందిన లబ్ధి ఇలా..**

| పథకం | లబ్ధిదారులు | లబ్ధి (రూ.కోట్లలో) |
|---|---|---|
| వైఎస్సార్ రైతు భరోసా | 2,17,424 | రూ.283.15 |
| వైఎస్సార్ సున్నా వడ్డీ | 43,145 | రూ.8.8 |
| వైఎస్సార్ క్రాప్ ఇన్సూరెన్స్ | 1,11,988 | రూ.199.11 |
| ఇన్‌పుట్ సబ్సిడీ | 16,401 | రూ.20,246 |
| వైఎస్సార్ పెన్షన్ కానుక | 38,617 | రూ.514.60 |
| జగనన్న తోడు | 4,920 | రూ.11.44 |
| వైఎస్సార్ ఆసరా | 3,707 | రూ.90.68 |
| వైఎస్సార్ సున్నా వడ్డీ | 5,200 | రూ.29.31 |
| వైఎస్సార్ చేయూత | 10,824 | రూ.56.02 |
| వైఎస్సార్ బీమా | 1040 | రూ.15.58 |
| ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీ | 4,231 | రూ.610.69 |
| వైఎస్సార్ ఆసరా | 23,477 | రూ.13.72 |
| వైఎస్సార్ సున్నావడ్డీ | 45,223 | రూ.6.28 |
| వైఎస్సార్ చేయుత (అర్బన్) | 9662 | రూ.18.12 |
| ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీ (అర్బన్) | 28,170 | రూ.198.88 |
| జగనన్నతోడు (అర్బన్) | 4,128 | రూ.5.06 |
| వైఎస్సార్ ఆరోగ్య శ్రీ | 31,874 | రూ.55.4 |
| జగనన్న అమ్మఒడి | 1,38,016 | రూ.1.99.84 |
| జగనన్న విద్యాకానుక | 2,45,699 | రూ.45.59 |
| వైఎస్సార్ నేతన్న నేస్తం | 1863 | రూ.4.47 |
| జగనన్న వసతి దీవెన | 15,165 | రూ.15.58 |
| జగనన్న విద్యాదీవెన | 17,661 | రూ.29.87 |
| జగనన్న చేదోడు | 6,241 | రూ.6.24 |
| వైఎస్సార్ ఈబీసీ నేస్తం | 2,948 | రూ.4.42 |
| వైఎస్సార్ కాపు నేస్తం | 1049 | రూ.1.57 |
| ఇమామ్‌లు, మౌజన్లు | 210 | రూ.2.71 |
| వాహన మిత్ర | 1288 | రూ.1.288 |
| అర్చకులు | 627 | రూ.1.93 |
| జూనియర్ అడ్వొకేట్లు | 8 | రూ.0.048 |

## రైల్వే ఉద్యోగి ఆత్మహత్య



మృతుడు రమేష్

**గుత్తి:** ఆర్థిక ఇబ్బందులు తాళలేక రైల్వే ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి ఆర్‌ఎస్‌లోని సుందరయ్య కాలనీలో నివాసముంటున్న రమేష్ (36) రైల్వేలో టీసీగా పనిచేస్తున్నాడు. వ్యసనాలకు బానిసైన ఆయన తన అవసరాలకు మించి అప్పులు చేశాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన ఆయన శనివారం విషపూరిత ద్రావకం తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురానికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆదివారం తెల్లవారుజామున ఆయన మృతి చెందాడు. కాగా, మృతుడికి భార్య., ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## టీడీపీ కవ్వింపు చర్యలు

**గుత్తి:** స్థానిక సీఎస్ఐ టౌన్ చర్చి వద్ద ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం సాగిస్తుండగా టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు దిగారు. గుంతకల్లు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం సోదరుడు నారాయణ, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దిల్కా శీనా పలువురు కార్యకర్తలతో కలసి చర్చిలోకి దూసుకెళ్లారు. అప్పటికే అక్కడ ఉన్న వైఎస్సార్ సీపీ శ్రేణులను మాటలతో రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. దీంతో కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న సీఐ వెంకట్రామిరెడ్డి, ఎస్ఐ నబీరసూల్, సిబ్బంది అక్కడికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిజెప్పారు. ఆ సమయంలో టీడీపీ నాయకులు మరింత రెచ్చిపోయి కేకలు వేయడంతో సీఐ గద్దించారు. దీంతో టీడీపీ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. గతంలో గుత్తిలో ఎన్నికల సమయంలో ఎప్పుడూ ఈ తరహా వివాదాలు లేవని, గుమ్మనూరు అడుగు పెట్టినప్పటి నుంచే ప్రశాంతతకు భంగం కలుగుతోందని ప్రజలు చర్చించుకోవడం గమనార్హం.

## ప్రమాదంలో యువకుడి మృతి



వినీత్ (ఫైల్)

**లేపాక్షి:** ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... లేపాక్షి మండలం బయన్నపల్లికి చెందిన వినీత్ (22) ఇంట్లో ఆదివారం పుణ్యతిథి కార్యక్రమం ఉంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు లేపాక్షిలో వేచి ఉన్న కొండూరు నుంచి వచ్చిన బంధువులను పిలుచుకుని వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. ఇద్దరు మహిళలను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని వెళుతుండగా మార్గమధ్యంలో వాహనం అదుపుతప్పి ముగ్గురూ కిందపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వినీత్‌ను బెంగళూరుకు తీసుకెళుతుండగా కర్ణాటకలోని గౌరిబిదనూరు సమీపంలోకి చేరుకోగానే మృతి చెందాడు. గాయపడిన ఇద్దరు మహిళలు హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## రోబోటిక్ టెక్నాలజీతో మోకాలి మార్పిడి శస్త్రచికిత్స



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి

**కడప కోటిరెడ్డి సర్కిల్:** రాయలసీమలో మొట్టమొదటిసారిగా వైఎస్సార్ జిల్లా కడపలోని విద్యాసాగర్ హాస్పిటల్‌లో రోబోటిక్ టెక్నాలజీ సాయంతో 100 మోకాలి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. అరుదైన ఘనత సాధించిన సందర్భంగా ఆదివారం ఆస్పత్రిలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఆస్పత్రి అధినేత డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ.. 2009లో సంప్రదాయ పద్ధతిలో మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు ప్రారంభించినట్లు గుర్తు చేశారు. 2019లో కంప్యూటర్ నావిగేషన్ టెక్నాలజీని పరిచయం చేస్తూ నాణ్యమైన సేవలు అందించామన్నారు. ప్రస్తుతం రాయలసీమలో మొట్టమొదటి సారిగా అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీని అందిపుచ్చుకుని శస్త్రచికిత్సలు చేపట్టినట్లు తెలిపారు. ఊబకాయం ఉన్నవారు, ఎక్కువ మోకీలు అరుగుదల ఉన్నవారు, తక్కువ వయసులో మోకీలు మార్పిడి అవసరమైన వారు, మోకీలు దగ్గర మెటల్స్ ఉన్నవారు ఈ టెక్నాలజీ ద్వారా మెరుగైన ప్రయోజనాలు పొందవచ్చునన్నారు. కొన్ని సంవత్సరాలుగా 6 వేలకు పైబడి మోకీల శస్త్రచికిత్స చేసిన అనుభవంతో పాటు ప్రస్తుతం రోబోటిక్ టెక్నాలజీ వినియోగంతో మరింత సత్ఫలితాలు సాధిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీలక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## మైనార్టీలకు అండగా సీఎం వైఎస్ జగన్



సమావేశంలో మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి



ఆత్మీయ సమావేశానికి హాజరైన ముస్లిం మైనార్టీలు

- ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు

**రాయదుర్గం టౌన్:** దశాబ్దాలుగా అణచివేతకు గురైన ముస్లిం మైనార్టీలకు అండగా నిలిచి వారి సంక్షేమానికి, భద్రతకు భరోసానిచ్చిన ఏకైన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాయదుర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం రాయదుర్గంలోని ఆత్మకూరు వీధిలోని మైదానంలో జరిగిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. మతతత్వ బీజేపీతో టీడీపీ, జనసేన చేతులు కలపడమంటే ముస్లిం వ్యతిరేక నిర్ణయాలకు మద్దతు ప్రకటించినట్లేనని అన్నారు. ముస్లిం మైనార్టీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే మంచి జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

**రిజర్వేషన్లను కాపాడుకుందాం**

దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ వరప్రసాదంగా నిలిచిన ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్‌ను అధికారంలోకి రాగానే రద్దు చేస్తామంటూ ఇప్పటికే కేంద్రంలోని ప్రభుత్వ పెద్దలు ప్రకటించారని, అలాంటి బీజేపీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు మాటలను నమ్మి ఓటు వేస్తే రిజర్వేషన్ హక్కును కోల్పోవాల్సి ఉంటుందని మెట్టు గోవిందరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్‌తో పాటు ఇతర హక్కులను కాపాడుకోవాలంటే ముస్లిములంతా వైఎస్సార్‌సీపీకి ఓటేసి గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్ఆర్‌సీని రాష్ట్రంలో లేకుండా చూడాలన్నా, ఎన్ఆర్‌సీకి వ్యతిరేకంగా అసెంబ్లీలో జగన్ చేసిన తీర్మానాన్ని కాపాడుకోవాలన్నా, యూనిఫాం సివిల్‌కోడ్‌ను ఎదుర్కొవాలన్నా వైఎస్ జగన్ ప్రభుత్వమే రావాలన్నారు.

**చంద్రబాబుకు గుణపాఠం చెబుదాం**

ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్న చంద్రబాబుకు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని మెట్టు గోవిందరెడ్డి కోరారు. రాజకీయంగా అభివృద్ధి చెందకుండా ముస్లింలను అణచివేసిన చరిత్ర చంద్రబాబుదన్నారు. సీఎం జగన్ ఓ ఉప ముఖ్యమంత్రిని, ఓ శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌ను. నలుగురు ఎమ్మెల్యేలను, నలుగురు ఎమ్మెల్సీలతో పాటు అనేక పదవులను ముస్లింలకు కట్టబెట్టారన్నారు. మరోసారి జగన్‌కు ముస్లిం సమాజం అండగా ఉండాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, మున్సిపల్ వైస్ చైర్మన్లు వలిబాషా, శ్రీనివాసయాదవ్, పట్టణ కన్వీనర్ ఆరవా శివప్ప, వైఎస్సార్‌సీపీ నాయకుడు పొరాళ్ల శివకుమార్, వార్డు కౌన్సిలర్లు నసీమా, కౌన్సిలర్ లుబ్నా గజాల, శారదమ్మ, శ్రీనివాసరెడ్డి, మాజీ కౌన్సిలర్ గోనబావి సర్మాస్, వార్డు ఇన్‌చార్జ్‌లు గోల్డ్ ఇస్మాయిల్, గోనబావి నిజాముద్దీన్, శ్రీరామిరెడ్డి, నాయకులు మాధవరెడ్డి, నాగప్ప, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

## తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీదే విజయం

- ట్రికార్ చైర్మన్ గుండా సురేంద్ర



**తాడిపత్రి రూరల్:** ఎన్నికల్లో తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఘన విజయం సాధిస్తారని ఏపీ షెడ్యూల్డ్ తెగల కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ట్రికార్) చైర్మన్ గుండా సురేంద్ర అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఆయన కలిసి మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని అభివృద్ధిని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసి చూపించారన్నారు. రాష్ట్రంలోని అన్ని కులాల అభివృద్ధికి బాటలు వేశారన్నారు. తాడిపత్రిలో అభివృద్ధి గురించి టీడీపీ నాయకులు మాటలు చెప్పడమే కానీ చేతల్లో చూపించలేక పోయారన్నారు. 40ఏళ్ల చరిత్ర కలిగిన తాడిపత్రి టీడీపీ నాయకులు కానీ, 14ఏళ్లుగా ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు కానీ తాడిపత్రి పట్టణంలో 30 పడకల ఆస్పత్రిని వంద పడకలకు మార్చలేకపోయారన్నారు. ఎమ్మెల్యేగా పెద్దారెడ్డి గెలిచిన వెంటనే వంద పడకల ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారన్నారు. కూరగాయల మార్కెట్ వద్ద టీడీపీ నాయకులు అడ్డంకులు సృష్టించిన వైఎస్సార్ అర్బన్ క్లినిక్‌ను ప్రారంభించి పేదలకు నాణ్యమైన వైద్యసేవలు చేరువ చేశారన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు సొంత నిధులతో ట్రాఫిక్ పోలీసు స్టేషన్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే పెద్దారెడ్డి ప్రయత్నిస్తే టీడీపీ నాయకులు అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. చిరు వ్యాపారులకు మున్సిపాలిటీ రుసుంను ఎమ్మెల్యే పెద్దారెడ్డి రద్దు చేయించారని గుర్తు చేశారు. నాడు-నేడు కింద రూ.లక్షల వ్యయంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ నిర్మాణానికి ప్రయత్నిస్తే టీడీపీ నాయకులు అడ్డుకోవడమేకాక కోర్టును ఆశ్రయించారన్నారు. వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యమని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

## ఇల్లాలిని హతమార్చి... పునాదిలో పాతిపెట్టి!

**పావగడ:** పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ నేరళకుంటె గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. భార్యను భర్తనే హతమార్చి ఇంటి పునాదిలో పాతిపెట్టాడు. వివరాలు.. నేరళకుంటె గ్రామ దళిత వాడకు చెందిన కార్తీక్‌కు కొన్నేళ్ల క్రితం శివమొగ్గకు చెందిన జ్యోతి (30)తో వివాహమైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో శనివారం రాత్రి జ్యోతిని భర్త హతమార్చి గుట్టు చప్పుడు కాకుండా ఇంటి ఎదుట ఉన్న పునాదిలో పాతి పెట్టాడు. అయిదే ఆదివారం ఉదయం వీధిలో సంచరిస్తున్న వారికి ఇసుకలో పాతిపెట్టిన మృతదేహం ఆనవాళ్లు కనిపించాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. పునాదిలోని ఇసుకను కాస్త తొలగించి చూస్తే జ్యోతి మృతదేహం కనిపించింది. ప్రాథమిక విచారణలో ఈ ఘాతుకానికి ఒడిగట్టింది భర్తనేనని తేలింది. అయితే మృతదేహాన్ని వెలికి తీసేందుకు స్థానిక మేజిస్ట్రేట్ అనుమతి కావాల్సి ఉండడంతో సోమవారానికి వాయిదా వేశారు. ఆదివారం రాత్రి పోలీసులు అక్కడే ఉండిపోయారు.

## మందకృష్ణను అడ్డుకుంటాం

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్నోబులేసు



**అనంతపురం కార్పొరేషన్:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎమ్మార్పీఎస్ మందకృష్ణ మాదిగ చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని, బేషరత్తుగా క్షమాపణ చెప్పకపోతే ఆయన పర్యటను ఎక్కడ పడితే అక్కడ అడ్డుకుంటామని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్నోబులేసు హెచ్చరించారు. ఆదివారం అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మందకృష్ణ చేసిన ఆరోపణలను ఖండించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వాకంతోనే మాదిగలపై వివక్ష పెరిగిందన్నారు. మాదిగల ఎదుగుదల ఇష్టం లేని చంద్రబాబుకు మందకృష్ణ వత్తాసు పలకడం సిగ్గు చేటన్నారు. వాస్తవానికి దళితులను బిచ్చగాళ్లుగా చూసింది చంద్రబాబేనన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే దళితులకు అన్ని విధాల న్యాయం చేకూరిందన్నారు. ఇప్పటికైనా మందకృష్ణ మాదిగ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేకపోతే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# గుంతకల్లును కాపాడుకుందాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైవీఆర్


ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన భవన నిర్మాణ కార్మికులు

- గుమ్మనూరుకు ఓటేస్తే భవిష్యత్తు అంధకారమే
- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

**గుంతకల్లుటౌన్:** అరాచకాలు, దౌర్జన్యాలకు బ్రాండ్ అంబాసిడర్ అయిన టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరామ్ లాంటి వ్యక్తుల నుంచి గుంతకల్లు నియోజకవర్గాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం గంట చర్చి రోడ్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపక నాయకుడు మేస్త్రీ దొడ్డప్ప ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వందలాది మంది భవన నిర్మాణ రంగంపై ఆధారపడిన కార్మికులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి జయరామ్‌కు పొరపాటున ఓటేస్తే ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన గుంతకల్లు నియోజకవర్గంలో అరాచకాలు పెట్రేగిపోతా యన్నారు. గుమ్మనూరు బ్రదర్స్ కొనసాగించే అసాంఘిక కార్యకలాపాలు, దౌర్జన్యాలు ఎలా ఉంటాయో సొంత పార్టీ నాయకులే కళ్లకు కట్టినట్లు చూయించారన్నారు. వాల్మీకి వర్గానికి చెందిన ఆయనను ఐదేళ్ల పాటు మంత్రి పదవిలో కొనసాగించిన జగనన్ననే మోసం చేశారన్నారు. నియోజకవర్గంలో బోయ సామాజిక వర్గానికి ఎన్నో ప్రాధాన్యతమైన పదవుల్లో కూర్చోబెట్టిన ఘనత తమదేనన్నారు. గుంతకల్లుకు మంజూరైన సోలార్ పవర్‌గ్రిడ్ ప్రాజెక్టులో నియోజకవర్గానికి చెందిన 5 వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. మేస్త్రీ దొడ్డప్ప విజ్ఞప్తి మేరకు కార్మికుల కోసం కల్యాణ మండప నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శంకర్‌నారాయణను గెలిపించాలన్నారు. ప్రజలను మోసం చేయడానికి సూపర్ సిక్స్ పథకాల పేరిట టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో అంతా బూటకమేనన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌ను మరోసారి సీఎం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గాదిలింగేశ్వరబాబు, మాజీ కౌన్సిలర్ మేస్త్రీ రంగన్న, పార్టీ యువనేత సందీప్‌రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు బిల్డర్ శివ, మేస్త్రీ తిమ్మప్ప, మేస్త్రీ మస్తాన్, పార్టీ నాయకులు దశరథరెడ్డి, మహదేష్, బావన్న పాల్గొన్నారు.


గుంతకల్లు మండలం నెలగొండలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

### వైఎస్సార్‌సీపీతోనే ప్రజా సంక్షేమం

**గుంతకల్లు రూరల్:** వైఎస్సార్‌సీపీతోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని నెలగొండ, వెంకటాంపల్లి, దంచర్ల గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. గడచిన ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు జరిగిన మంచిని వివరిస్తూ ముందుకు సాగారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా గత ఐదేళ్లు కృషి చేశానని, ప్రజలు ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధిని చేసి చూపుతానని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, వేలాది మంది అభిమానులు పాల్గొన్నారు.

## మీ చల్లని దీవెనలందించండి


ఆర్‌సీఎం చర్చిల్లో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

**గుంతకల్లుటౌన్:** నియోజకవర్గ ప్రజలకు మరింత మేలు చేయడంతో పాటు శాశ్వతంగా నిలిచిపోయేలా అభివృద్ధి పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్న తనను మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి క్రైస్తవులను కోరారు. ఆదివారం ఆయన పట్టణంలోని ఆర్‌సీఎం, సీఎస్ఐ, ఎస్‌పీజీ, కల్వరి,బెయెర్షబా తదితర చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ల నుంచి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం చర్చి బయట క్రైస్తవులను కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శంకరనారాయణలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీఎం జగన్‌తోనే క్రిస్టియన్ల అభ్యున్నతి సాధ్యమన్నారు. అలాగే వార్డుల్లో ఉన్న చర్చిల బయట కౌన్సిలర్లు ఓటు అభ్యర్థించారు. ప్రార్థనల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, ఎమ్మెల్యే చిన్న కుమార్తె నిషితారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, ఎస్సీ సెల్ నాయకులు బావన్న, ముని, ఆనంద్, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, ఎస్సీసెల్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వెలిగొండ రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వ


ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న అంబేడ్కర్ వాసులు

# వెలిగొండకు హంద్రీనీవా నీరు తీసుకొస్తాం

- రోడ్‌షోలో ఉరవకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వ

**ఉరవకొండ:** వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వెలిగొండకు హంద్రీనీవా నీరు తీసుకొచ్చి, గ్రామాలకు నీరు అందిస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని వెలిగొండలో ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వ ఎన్నికల ప్రచారం చేశారు. ముందుగా ఎంపీపీ నరసింహులు, గ్రామ సర్పంచ్ వీరాంజనేయులు, గ్రామ యూత్ నాయకులు శివ తదితరులు ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వకు భారీ గజమాలతో స్వాగతం పలికారు. రోడ్‌షోలో విశ్వ మాట్లాడుతూ వెలిగొండ గ్రామ ప్రజల దశాబ్దాల కల అయిన ఉరవకొండ నుంచి వెలిగొండకు రూ. 1.20 కోట్లతో నూతనంగా రోడ్డు వేయించామన్నారు. మరో రెండు నెలల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మించి, ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా గ్రామానికి నీరు అందిస్తామన్నారు. రోడ్లు, డ్రైయినేజీలు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు తేజోనాథ్, అశోక్, మూస్టురు బాబు, వెలిగొండ నాయకులు నాగప్ప, ఓబన్న, శంకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి, పార్టీ యువజన విభాగం రాయలసీమ జిల్లాల జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన టీడీపీ నాయకులు అనిల్, గుజ్జుల పవన్, నరసింహ (హిట్లర్) బోయ పవన్, ఓబుళేసులను ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వ పార్టీలోకి ఆహ్వానించారు. అంబేడ్కర్‌నగర్‌కు చెందిన మరికొందరు టీడీపీ నాయకులు తొండ్లం వెంకటేష్, బండారు మోహన్, ఓబుళేసు, మోహన్‌లు యువజన విభాగం నాయకులు విక్కీ ఆధ్వర్యంలో యువనేత ప్రణయ్‌రెడ్డి సమక్షంలో పార్టీలోకి చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, విక్కీ, దివాకర్, గంగాధర్, శంకర్, జయరాం, వెంకటేష్, వరప్రసాద్, లాలుస్వామి, ధనరాజ్, మోహన్, విజయ్, యన్నప్ప తదితరులు పాల్గొన్నారు.


యువనేత ప్రణయ్ సమక్షంలో పార్టీలోకి చేరుతున్న అంబేడ్కర్ నగర్ నాయకులు

## పార్టీలకతీతంగా పథకాలు అందించాం


గాజుల మల్లాపురంలో ప్రచారం చేస్తున్న విశ్వేశ్వరరెడ్డి

**విడపనకల్లు:** సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించాం.. ప్రజలకు మంచి చేశాం కాబట్టే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అడుగుతున్నాం.. త్వరలో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి ఓటర్లను కోరారు. ఆదివారం మండలంలోని గాజుల మల్లాపురం,ఉండబండ గ్రామాల్లో విశ్వేశ్వరరెడ్డి ప్రచారం నిర్వహించారు. ముందుగా గాజుల మల్లాపురంలో వడ్డే,కాపు, క్యాంపు కాలనీలో రోడ్డు షో నిర్వహించారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందన్నారు. అవే పథకాలు కొనసాగాలంటే మరోమారు జగన్‌మోహన్ రెడ్డిని సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉరవకొండ ప్రజలు కేశవ్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఏనాడైనా ప్రజా సమస్యలు పట్టించుకున్నాడా? అని ప్రజలను అడిగారు. టీడీపీ హయాంలో ప్రజల సంక్షమం, అభివృద్ధి ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. అభివృద్ధి అంటేనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తాను గెలిచినా, ఓడినా నిరంతరం ప్రజల మధ్యనే, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. తనను ఆశీర్వదిస్తే ఉరవకొండ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అంతకుముందు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌గౌడు, ఎర్రిస్వామిరెడ్డి, వన్నారెడ్డి, కావలి వెంకటేశులు, అంజి, ఎద్దుల వన్నారెడ్డి, చంద్రశేఖర్, షన్ముఖగౌడు, రామిరెడ్డి, నాగరాజు, నీలాకంఠారెడ్డి,వడ్డే వెంకటేశులు,ఆ టో వన్నప్ప తదితరులు విశ్వేశ్వరరెడ్డికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత చవ్వా రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ కరణం పుష్పావతి, వీరశైవ లింగాయతి ఉపాధ్యక్షులు దండిన శివానంద, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, నాయకుల జేసీఎస్ కన్వీనర్ భరత్‌రెడ్డి, కరణం భీంరెడ్డి, శంకర్‌గౌడు, వన్నారెడ్డి,కావలి వెంకటేశులు, ప్యాపిలి నాగరాజు, అశోక్, శ్రీధర్ ప్రకాష్‌గౌడు, ఎర్రిస్వామిరెడ్డి, ఉమాశంకర్, అంజి, కావలి చంద్రశేఖర్, దాసరి వెంకటేశులు, శివగౌడు, రాజశేఖర్, గాజుల చిన్న వెంకటేశులు, పెద్ద వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఉరవకొండలో ప్రారంభమైన హోం ఓటింగ్


బ్యాలెట్ బాక్సు తీసుకెళ్తున్న సిబ్బంది

**ఉరవకొండ:** మంచానికే పరిమితమై, లేవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల కమిషన్ హోమ్ ఓటింగ్ సదుపాయం కల్పించింది. ఇంటి నుంచే ఓటు వేసే కార్యక్రమం అందుబాటులోకి తెచ్చారు. ఆదివారం పట్టణంలో మొత్తం ఆరుగురు ఓటర్లు హోం ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 72 మంది ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

### కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్

**గుంతకల్లు:** స్థానిక డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మున్సిపల్ హైస్కూల్ ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. మూడో రోజు 607 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను ఉపయోగించుకున్నట్లు నోడల్ ఆఫీసర్ వి.చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. నియోజకవర్గంలో 2,267 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ పద్ధతిలో ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండంగా ఈ మూడు రోజుల్లో 1,183 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. సోమవారం పోస్టల్ బ్యాలెట్‌కు చివరి రోజు అన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు విధింగా పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### కంటి వైద్య శిబిరానికి స్పందన


కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

**పామిడి:** పట్టణంలోని వాసవీ కల్యాణమంటపంలో ఆదివారం పామిడి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరంలో కంటివైద్య నిపుణులు సిమ్రాన్ 248 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 101 మందిని కంటిశస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు, క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ, అధ్యక్షురాలు డాక్టర్ శాంతిప్రియ, ఉపాధ్యక్షుడు పీసీ జయరాంరావు, కోశాధికారి షెక్షావలి, ప్రధాన కార్యదర్శి రఘువీర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రోషన్ జమీర్, శివ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

# టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

**పామిడి:** పట్టణంలోని ఎద్దులపల్లిరోడ్డులో టీడీపీకి చెందిన 15 కుటుంబాలు ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. గుత్తిమార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో దివంగత మాజీ కౌన్సిలర్ నాగేశ్వరమ్మ కుమారుడు సంతోష్ రెడ్డి సారథ్యంలో షఫీ, దాదు, కిష్టఫర్ బాబు, కరీం, రియాజ్, భరత్, కిరణ్, సిద్ధ, అరుణ్, సతీష్ కుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి తదితరులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు బోయ రామచంద్ర, సునీల్‌కుమార్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, అనుంపల్లి సూరి, పెద్దకాలువ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

**గుత్తి రూరల్:** మండలంలోని పెద్దొడ్డి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చెరారు. పామిడిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరిన పెద్దొడ్డికి చెందిన నరేష్‌యాదవ్, మోహన్ యాదవ్‌లతో పాటుగా వారి కుటుంబసభ్యులకు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ శివరామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

# జగనన్నతోనే రాజన్న రాజ్యం

**పామిడి:** జగనన్నతోనే రాజన్న రాజ్యం సాధ్యమని గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి అన్నారు. మండలంలోని పాళ్యం, అప్పాజీపేట గ్రామాల్లో ఆదివారం ఆమె ప్రచారం చేశారు. పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో కలసి ఆమె ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అర్హతే ప్రామాణికంగా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ప్రథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, ప్యాకేజీ దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ కల్లిబొల్లి మాటలను నమ్మొద్దన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గుంతకల్లు ఎమ్మెల్యేగా వై.వెంకట్రామిరెడ్డిని, అనంతపురం ఎంపీగా శంకరనారాయణను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ సీబీ జానకిరామిరెడ్డి, పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజోడే కుమార్, కే నారాయణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి బీ రమణారెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, చుక్కలూరు రామకృష్ణారెడ్డి, ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి సర్పంచ్‌లు రామాంజనేయులు, మూలి నాగేశ్వర్‌రెడ్డి, పాళ్యంశీనా, నక్కా ఓబులేసు, నగేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


పాళ్యంలో ప్రచారం చేస్తున్న నైరుతిరెడ్డి తదితరులు

# వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం


కూడేరు: స్కందా వెంచర్‌లో ఓటు అభ్యర్థిస్తున్న కోదండ రాముడు, ఎంపీపీ నారాయణరెడ్డి


బెళుగుప్ప: అంబేడ్కర్ కాలనీలో ప్రచారం చేస్తున్న దృశ్యం

**కూడేరు:** మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న స్కందా వెంచర్లో వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి వారు ఎమ్మెల్యే అభ్యర్థి వై. విశ్వేశ్వర రెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణకు మద్దతుగా ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణ రెడ్డి, ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి మంజునాథ్ రెడ్డి, మండల కన్వీనర్ రామచంద్రా రెడ్డి, నేతలు గొటుకూరు మదన్ మోహన్ రెడ్డి, తిమ్మారెడ్డి, కృష్ణారెడ్డి, నాగేశ్వర రెడ్డి, భాస్కర్ రెడ్డి, నాగిరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బెళుగుప్ప:** మండల పరిధిలోని శీర్పి, ఆవులెన్న, ఎర్రగుడి, వెంకటాద్రిపల్లి, కోనాపురం, విరుపాపల్లి, బెళుగుప్ప , బెళుగుప్ప తండాలో ఆదివారం ప్రచారం చేశారు. అంబేడ్కర్ కాలనీ, వినాయక నగర్, బీసీ కాలనీల్లో నాయకులు మచ్చన్న, శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు పూల ప్రసాద్, బండయ్య, పాతన్న, శ్రీనివాసనాయక్, తిమ్మారెడ్డి, విద్యాసాగర్, రాము, గురుమూర్తిరెడ్డి, డెయిరీ తిప్పేస్వామి, నరసింహారెడ్డి, పెద్దన్న, కిశోర్, బాబురెడ్డి,భీమన్న, సుంకానాయక్, గోవిందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పామిడిలో నాయకుల ముమ్మర ప్రచారం

**పామిడి:** పామిడిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పార్టీ విజయం కోసం ఆదివారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, కిసాన్‌సెల్ నాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, మైనార్టీనేత సీ అబ్దుల్‌రజాక్ ఆధ్వర్యంలో స్థానిక 6, 8 వార్డుల్లో వారు ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. ఎమ్మెల్యేగా వై వెంకట్రామిరెడ్డిని, ఎంపీగా ఎం శంకరనారాయణను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దత్తు, జీ రాజశేఖర్ రావు, 6,8 వార్డు ఇన్‌చార్జులు ప్రవీణ్, సంతోష్, రఘువీర్, శివయాదవ్, డీవీ మనోజ్‌కుమార్, జాఫర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

# జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి

**పామిడి:** సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని ఎంపీ అభ్యర్థి ఎం.శంకరనారాయణ కోరారు. ఆదివారం సాయంత్రం మండలంలోని రామరాజుపల్లిలో ఆయన ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌ను మరోసారి సీఎం చేయాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం జగనన్నతోనే సాధ్యమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ మోసపూరిత హామీలను నమ్మి మోసపోవద్దు అన్నారు. ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా వై.వెంకట్రామిరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపించాలంటూ ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జ్ సీబీ జానకిరామిరెడ్డి, పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజోడే కుమార్, కే నారాయణరెడ్డి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్ రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి బీ రమణారెడ్డి, సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి, రామశేఖర్‌రెడ్డి, ఓబులేసు, బద్రీనాయక్ తదితరులు పాల్గొన్నారు.


రామరాజుపల్లిలో ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ

## వైఎస్సార్‌సీపీలో చేరిక


కోనంపల్లిలో ఆమిదాల ఎర్రిస్వామిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న విశ్వేశ్వరరెడ్డి

**బెళుగుప్ప:** మండలంలోని కోనంపల్లిలో సీనియర్ నాయకులు నాగిరెడ్డి, హనుమంతురాయుడు, అనంతరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఆమిదాల ఎర్రిస్వామి, సోదరుల కుటుంబాలతో కలిసి విశ్వేశ్వరరెడ్డి సమక్ష్యంలో ఆదివారం పార్టీలోకి చేరారు. హనిమరెడ్డిపల్లిలో సీనియర్ నాయకులు గోపాల్, ఎర్రిస్వామి ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నాయకులు చామంతి అక్కులన్న, కురుబ రాజేష్, కాలువపల్లిలో సర్పంచ్ ఎండీ పెద్దన్న, మాజీ సర్పంచ్ తిమ్మన్న, లక్ష్మానాయక్, రామకృష్ణానాయక్ స్థానిక నాయకుల ఆధ్వర్యంలో టీడీపీ సీనియర్ నాయకులు దుర్గానాయక్, సన్నతిప్పన్న నాయక్, సుగాలి శీనానాయక్, అంజినాయక్, రఘునాయక్, రవినాయక్‌లు వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దన్న, రాష్ట్ర నాయకులు త్రిలోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మా నాన్నను గెలిపించండి

**ఉరవకొండ:** త్వరలో జరిగే ఎన్నికల్లో నిండుమనసుతో మా నాన్న విశ్వేశ్వరరెడ్డిని గెలిపించాలని యువనేత ప్రణయ్‌రెడ్డి కోరారు. ఆదివారం రేణుమాకుపల్లి, ఉరవకొండ పట్టణంలోని శాంతినగర్, కొలిమి లేవుట్ కాలనీల్లో యువనేత ప్రణయ్ ప్రచారం చేశారు. రేణుమాకుపల్లిలో ఇంటింటికీ వెళ్లి విశ్వేశ్వరరెడ్డి, శంకరనారాయణను గెలిపించాలని కోరారు. అనంతరం శాంతినగర్‌లో నిర్వహించిన ప్రచారంలో పార్టీ కోఆప్షన్ సభ్యులు పామిడి సలీం, పామిడి నూర్, సోదరులు పామిడి తయ్యూబ్, పామిడి నిజాం, సతీష్, యూనుస్, బెలగళ్ షమ్ము, తన్వీర్, హుసేన్ తదితరులు ప్రణయ్‌రెడ్డికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, మాజీ ఎంపీపీ చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఇంటింటా ప్రచారం చేస్తున్న యువనేత ప్రణయ్‌రెడ్డి

# జగన్ పాలనలో గంగపుత్రులకు పెద్దపీట

**వజ్రకరూరు:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గంగపుత్రులకు (బెస్త)పెద్దపీట వేశారని బెస్త కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కేవీ రమణ అన్నారు. ఆదివారం గడేహోతూరులో ఎన్నికల ప్రచారం చేశారు. కేవీ రమణ మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సురేంద్ర, పార్వతి, వెంకటరెడ్డి, శైలజారె డ్డి, సుశీలమ్మ, సుంకమ్మ, డిష్ సురేష్, గోవర్దన్, సందీప్‌రెడ్డి, తిమ్మారెడ్డి, పరమేష్, అట్టిలహరి, పోలికి రాముడు,ఓ బుళేసు, కరిబసి, రామలింగ, నాగరాజు, నాగేంద్ర, మునిస్వామి, ఖాజాబీ పాల్గొన్నారు.


గడేహోతూరులో ప్రచారం చేస్తున్న నాయకులు

### సర్పరూపుడికి పంచామృతాభిషేకాలు

**ఆత్మకూరు:** పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. తొలుత స్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు అనంతరం పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నవగ్రహ కాల సర్పదోష నివారణ రాహుకేతు హోమాలు నిర్వహించారు. అదే విధంగా ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతి దేవికి ప్రత్యేక పూజలు చేపట్టారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

# వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆదరించండి

**గుత్తి రూరల్:** ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా శంకరనారాయణ, ఎమ్మెల్యేగా వై.వెంకట్రామిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, సర్పంచ్ మక్కెల చంద్ర, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని ధర్మాపురం, కె.ఊబిచెర్ల గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులు, ప్రసాద్, సురేష్, మల్లయ్యాయాదవ్, ప్రవీణ్‌కుమార్ యాదవ్, వెంకటేశ్వరరెడ్డి, హరికృష్ణ, ఇబ్రహీం, మాజీ సర్పంచ్ కొండయ్య పాల్గొన్నారు.

### వార్డుల్లో వైఎస్సార్‌సీపీ నాయకుల విస్తృత ప్రచారం

**గుత్తి:** గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డుల్లో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్మన్‌లు బిందె వరలక్ష్మి, పద్మలత, కౌన్సెలర్లు, గుత్తి ఇన్‌చార్జ్ శ్రీనివాస రెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి, జిల్లా నాయకులు రాజ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. సంక్షమ పథకాలు కొనసాగాలంటే జగన్‌ను మరోసారి సీఎం చేసుకోవాలన్నారు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, గుంతకల్లు ఎమ్మెల్యేగా వెంకటరామిరెడ్డి, ఎంపీగా శంకర నారాయణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీసభ్యుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, పట్టణ, మండల కన్వీనర్లు పీరా,గోవర్దన్ రెడ్డి, పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు రంగస్వామి, సుభాష్‌రెడ్డి, జిల్లా నాయకులు మధుసూదన్ రెడ్డి, గురు ప్రసాద్‌యాదవ్, రంగ ప్రసాద్ రాయల్, సీవీ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గుత్తి మండలం ధర్మాపురంలో కరపత్రం అందజేస్తున్న ఎంపీపీ, నాయకులు


గుత్తి ఆర్ఎస్‌లోని 6వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు


గుత్తి ఆర్ఎస్‌లోని 15వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు